క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



పూర్ణాహుతి చక్రస్నానం పూజలు చేస్తున్న పండితులు

ఉంగుటూరు: నారాయణపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు విశేష పూజలు చేశారు. శనివారం పూర్ణాహుతి, చక్రస్నానం, శాంతి హోమం వంటి పూజలు చేశారు. భక్తులు పాల్గొని ఈ క్రతువును పూర్తి చేశారు. శుక్రవారం శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవగ్రహ అంకురార్పణ, బలిహర నీరాజనం, శాంతి హోమం, సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీహోమం నిర్వహించారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి చర్యలు



తాళ్లగూడెంలో విద్యార్థుల నుంచి సమాచారం రాబడుతున్న జాయింట్ కలెక్టరు పి.ధాత్రిరెడ్డి

పెదపాడు : పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టరు పి ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని తాళ్లగూడెంలో శనివారం జేసీ పర్యటించి స్థానిక పాఠశాలలో తనిఖీ నిర్వహించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, వర్క్‌బుక్‌లను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ, డ్రెయినేజీల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తనిఖీ చేసారు. ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, ఎంపీడీవో మహ్మద్ అమీల్ జమ, సీడీపీఓ విజయలక్ష్మి, పీఆర్‌ఏఈ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రతి ఇంటా శుక్రవారం డ్రైడే పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, డ్రెయిన్ల పరిశుభ్రత పనులను పరిశీలించారు. బాదంపూడి, నీలాద్రిపురంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొంటుందని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజరు శ్రీనివాసరావు, పర్యవేక్షకుడు సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్తలు దుర్గాదేవి, అమరావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశలు స్వాతి, దుర్గ లక్ష్మి, పాల్గొన్నారు.

కులవివక్ష చట్టవిరుద్ధం



అర్ధవరంలో పౌరహక్కుల సదస్సులో మాట్లాడుతున్న మంగరాజు

గణపవరం: సమాజంలో ఉన్న అన్నికులాలు, మతాలు, వర్గాలు సమానమని, కులవివక్ష చట్టవిరుద్ధమని, కులవివక్ష చూపేవారు శిక్షార్హులని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్‌సెల్ సెల్ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. గణపవరం మండలం అర్ధవరంలో జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పౌరహక్కుల అవగాహన సదస్సుకు డిప్యూటీ తహసీల్దార్ విజయరత్నం అధ్యక్షత వహించారు. ఈ సదస్సులో మంగరాజు మాట్లాడుతూ సివిల్స్ రైట్స్‌డే కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నానికి మాజీ ఎమ్మెల్యే వాసుబాబు పరామర్శ

భీమడోలు: భీమడోలు సొసైటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత నవలం నానిని శనివారం మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పరామర్శించారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్లకు చెందిన నవలం నాని వెన్నెముకకు ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో నాని ఇంటికి వాసుబాబు వెళ్లి ఆయనను పరామర్శించారు.

కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే

- దెందులూరు నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్న సర్వే
- ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



పెదపాడులో కుష్టు వ్యాధిపై సర్వే, అవగాహన కలిగిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

పెదపాడు: కుష్టు వ్యాధి ఒక ప్రాణాంతకమైన అంటువ్యాధిగా గతంలో భావించేవారు. ఈ వ్యాధిన పడిన వారిని ఊరుబయట ఉంచేవారు. వ్యాధిగ్రస్తుల వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే ఇష్టపడేవారు కాదు. కొన్నేళ్లుగా ప్రభుత్వాలు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రస్తుతం రోగులు అందరితో సాధారణ జీవితంతో గడుపుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులు వాడుతూ వ్యాధిని నయం చేసుకుంటున్నారు. తద్వారా అంగవైకల్యం రాకుండా చేసుకుంటున్నారు. 15 ఏళ్ల క్రితమే ఈ వ్యాధి అంతం కావాల్సి ఉండగా ఏటా అక్కడక్కడ కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో చేపట్టిన కుష్టు వ్యాధి లక్షణాల గుర్తింపు సర్వే చురుగ్గా సాగుతోంది. వచ్చే నెల 13వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగనుంది. కుష్టు వ్యాధి ఒక బ్యాక్టీరియా ద్వారా వస్తుంది. వ్యాధి లక్షణాలను సులభంగా గుర్తించవచ్చు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఎండీటీ మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సకాలంలో వైద్యం అందడం వల్ల వ్యాధి పూర్తిగా నయం అవుతుంది. అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు.

గత ప్రభుత్వంలో సర్వే ప్రారంభం

కుష్టువ్యాధి మహమ్మారిని సమాజం నుంచి దూరం చేయాలని లక్ష్యంతో గత ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖద్వారా ఇంటింటి సర్వే చేపట్టి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్యం అందించి ప్రాణాంతకమైన వ్యాధిగా మారకుండా తగు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కూడా వైద్యఆరోగ్య శాఖ కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వేనుకొనసాగిస్తోంది. దెందులూరు నియోజకవర్గంలో ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతోంది. పాజిటివ్ కేసులు ఉంటే వెంటనే వారికి వైద్యం అందించి వ్యాధినుంచి రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు వైద్యారోగ్య శాఖ చేపట్టింది.



పెదపాడులో కుష్టు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

చర్మంపై మచ్చలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దు

వ్యాధి సోకిన వ్యక్తికి 6 నుంచి 12 మాసాల్లో వ్యాధిని నివారించవచ్చు పెదపూడి మండలంలో 23 గ్రామ పంచాయతీల్లోని పెదపాడు, వట్లూరు పీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్‌ఎంలు ఇంటింటా సర్వేలు నిర్వహిస్తున్నారు, మండలంలో 152 మంది అనుమానితులను గుర్తించి ఇతర పరీక్షలకు పంపించారు.

సర్వే ద్వారా ప్రజలకు అవగాహన



గతంలో కుష్టు వ్యాధి సోకిందంటే భయంతో బాధపడేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదు. కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు వచ్చేనెల 13వరకు నిర్వహిస్తాం. వ్యాధి లక్షణాలున్న రోగులు భయపడకుండా సకాలంలో మందులువాడితే ఆరోగ్యంగా జీవించవచ్చు. వ్యాధిసోకిన రోగిని వారి గృహంలో ఉంటూ వైద్య సేవలు పొందవచ్చు. పాత రోగికి రెండు మాసాలుగా మందులు పంపిణీ చేస్తున్నాం. మరోకేసు కొత్తగా గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నాం.

– కె.అనంతపాల్, పెదపాడు, పీహెచ్‌సీ వైద్యాధికారి

కుష్టు వ్యాధి లక్షణాలు

- చర్మంపై స్పర్శలేని మచ్చలు
- మందమైన మెరిసే జిడ్డు గల చర్మం
- చెవులపై, వీపులపై ఎదపై నొప్పిలేని బుడిపెలు కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడక పోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం
- కాళ్ల చేతులు తిమ్మిర్లు కలిగి ఉండుట, పాదాల వాపు
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- తెలియకుండానే చేతులు కాళ్లలో బొబ్బలు రావడం
- చేతి, కాలువేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం

ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందుల పంపిణీ

ప్రభుత్వాసుపత్రిలో బహుళ ఔషధ చికిత్స మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) ద్వారా కుష్టు వ్యాధికి మందులు ఉచితంగా అందజేస్తున్నారు. ముందుగా వైద్యుడు వ్యాధి నిర్ధారణ చేస్తారు. ఆ తర్వాత మొదటి నెల వైద్యుని వద్ద, రెండో నెల నుంచి ఏఎన్‌ఎం ఆశావర్కరు ద్వారా ఇంటి వద్దే మందులు ఉచితంగా పంపిణీ చేస్తారు. వైద్యులు సూచనల మేరకు నిర్ణీత కాలానికి మందులు క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. స్పర్శ లేని మచ్చలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానికంగా ఉన్న పీహెచ్‌సీ లేదా విలేజ్ క్లినిక్‌లోని వైద్యులు చూపించాలి. అక్కడ అనుమానం వ్యక్తం చేస్తే వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులకు చూపించుకోవడం చాలా ముఖ్యం.

వాహనదారులకు కౌన్సెలింగ్



వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

దెందులూరు: వాహనాల యజమానులు అన్ని రికార్డులను జెరాక్సులను ప్రయాణించేటప్పుడు తమ వద్ద ఉంచుకోవాలని దెందులూరు ఏఎస్సై పీ.వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ హమీద్ అన్నారు. శుక్రవారం సోమవరప్పాడు జాతీయ రహదారిపై విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. హెల్మెట్లు లేనివారిని, వాహనాల రికార్డులు, నంబర్ ప్లేట్లు లేని వాహనదారులను తనిఖీ చేశారు. వాహన యజమానులకు హెడ్ కానిస్టేబుల్ హమీద్ కౌన్సెలింగ్ చేశారు.

పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు : మండలంలో 94.88 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాజ్‌మనోజ్ వెల్లడించారు. శనివారం సాయంత్రం వరకు పెన్షన్ల పంపిణీని మండలంలోని అన్ని గ్రామాలు తిరిగి పర్యవేక్షించారు. మండలంలో 11,370 పెన్షన్లకు 10,788 పెన్షన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

సిగ్నల్ లైటు లేక ప్రమాదాలు

దెందులూరు: సోమవరప్పాడు రహదారిపై సిగ్నల్ లైటు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సెయింట్ జాన్స్ బీఈడీ కళాశాల బ్రిడ్జి వద్ద నుంచి సోమవరప్పాడు వరకు రెండు లైన్ల రోడ్డు ఉంది. డివైడర్ ప్రారంభం వద్ద గతంలో సిగ్నల్ లైట్ స్తంభం ఉండేది. రోడ్డు డివైడర్ నిర్మాణం అనంతరం స్తంభం సిగ్నల్ లైట్ తీసివేశారు. సోమవరప్పాడు డివైడర్ వద్ద సిగ్నల్ లైట్‌ను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉత్తమ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



గణపవరం డిగ్రీ కాలేజిలో ఉత్తమ విద్యార్థులను నగదు పురస్కారాలు అందించిన దాతలు

గణపవరం: ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. గణపవరం మండలం సరిపల్లెకి చెందిన ప్రవాసాంధ్రులు రామ్ లక్ష్మణ్ తమ ఫౌండేషన్ ద్వారా జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేశారు. డిగ్రీ కాలేజిలో మొదటి బహుమతిగా రూ.40వేల నగదును బీఎస్సీ విద్యార్థిని యలగం హారికకు అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.20వేలు బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అలేఖ్యకు, తృతీయ బహుమతి రూ.10 వేలు బీఎస్సీ ఎంపీసీ విద్యార్థిని యర్రంశెట్టి కృష్ణకుమారికి అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నిర్మలకుమారి మాట్లాడుతూ జీవితంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా పుట్టిన గ్రామాన్ని, చదివిన విద్యాసంస్థను మరువలేమన్నారు. అమెరికాలో స్థిరపడిన రామ్, లక్ష్మణ్ సోదరులు ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి, ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించడంలోనూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. దాతలు రామ్, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ ఈప్రాంతంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యుఏసీ కోఆర్డినేటర్ చైతన్య, అధ్యాపకులు టి.అక్కిరాజు, స్వరూపరాణి, గణేష్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు స్మార్ట్ టీవీ వితరణ



స్మార్ట్ టీవీ ఆన్ చేస్తున్న ఎంపీడీవో జి.బేబీ శ్రీలక్ష్మి

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్‌కు దాతలు రూ.50 వేల విలువైన స్మార్ట్ టీవీ అందించడం అభినందనీయమని ఎంపీడీవో జి.బేబీ శ్రీలక్ష్మి అన్నారు. శనివారం ఆ స్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో టీవీ సమకూర్చిన నరసింహ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి సోమరాజు, వెలగపల్లి రైస్ మిల్ నిర్వాహకులు వంటాకుల రామకృష్ణ, పూర్వ విద్యార్థి కందుల రాజేష్ తండ్రి రాంబాబును ఎంపీడీవో ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం సుందర్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెండు ఐఎఫ్‌పీ ప్యానల్స్, రెండు స్మార్ట్ టీవీలు అందాయని, మిగిలిన నాలుగు తరగతుల్లోనూ దాతల సహకారంతో స్మార్ట్‌టీవీలు సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు కురెళ్ల వెంకటరత్నం, కవల కోదండ రాంబాబు, టీచర్స్ సీహెచ్ లీలా గోపాల్, పి.సౌజన్య తదితరులున్నారు.

పదవీ విరమణతో బాధ్యత తీరదు

నిడమర్రు: ఉపాధ్యాయ వృత్తిలో పదవీ విరమణ చేసేవారు తమ బాధ్యతలు తీరినట్లు భావించకుండా తమ సమయాన్ని విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కేవీఎస్ నాగమల్లేశ్వరరావు అన్నారు. నిడమర్రు మండలం ఛానమిల్లి తూర్పుపేట పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ చేసిన భూషణ్‌కుమార్‌ను ఎస్టీయూ, మండల శాఖ, మండలంలోని పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఎక్కువగా ఉండే ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా భూషణ్‌కుమార్‌ను ఎస్టీయూ తరపున కేఎస్‌వీ మల్లేశ్వరరావు, రజని, మండల శాఖ అధ్యక్షుడు కొట్టు రామాంజనేయులు, గంధం వినయ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమ్మవార్ల జాతరకు పటిష్ట ఏర్పాట్లు



జాతర సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో ఎస్సై వై.సుధాకర్, తహసీల్దార్, ఎంపీడీవో

భీమడోలు: భీమడోలులో నిర్వహించనున్న జాతరను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సూచనలను పాటించాల్సిన బాధ్యత ఉత్సవ నిర్వహణ కమిటీపై ఉందని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఈనెల 7వ తేదీ నుంచి భీమడోలులో 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరామమ్మ జాతర నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్, మంచి నీరు, విద్యుత్ తదితర అత్యవసర సేవలపై సంబంధిత అధికారులతో సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్సై వై.సుధాకర్, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి తదితరులు పాల్గొన్నారు. ఎస్సై వై.సుధాకర్ మాట్లాడుతూ ఈనెల 7 నుంచి మార్చి 9వ తేదీ వరకు పుష్కర కాలం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు హాజరయ్యే జనంతో ట్రాఫిక్ సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తమ వంతు కృషి చేస్తానన్నారు. మార్చి 8,9వ తేదీల్లో ప్రశాంతంగా ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలను అందించాలన్నారు. తహసీల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ ఆలయాల ప్రాంగణాల వద్ద వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, విద్యుత్ ఏఈ శివాజీ, ఈవోఆర్‌డీ వెంకట్రావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు, కార్యదర్శి కె.తనూజ, బాదర్వాడ కృష్ణమోహనరాజు, ఈతకోట సత్యకృష్ణ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపు



పోలసానిపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డులోని ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం

భీమడోలు: పోలసానిపల్లిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు వద్ద గల ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది శనివారం తొలగించారు. బ్రిడ్జిపై గోపాలపురం నియోజకవర్గం కూటమి నేతలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు. ఎమ్మెల్సీ కోడ్ అమలు కాగానే వారికి గ్రామ పంచాయతీ సిబ్బంది సమాచారం ఇచ్చి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని కోరారు. వారు స్పందించకపోవడంతో అధికారుల దృష్టికి ఈ సమస్యను పలువురు తీసుకుని వెళ్లారు. ఎమ్మెల్సీ కోడ్ కూయడంతో ఆ ఫ్లెక్సీలను పంచాయతీ సిబ్బంది తొలగించారు.

నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కృషి చేయాలి



టెన్త్ విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తన వంతు కృషి చేయాలని భీమడోలు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల నిర్వహణ తీరును ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ చేసారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఈ పాఠశాల పరీక్ష కేంద్రం కావడంతో వసతులను ఆయన పరిశీలించారు. పాఠశాలలోని నాలుగు సెక్షన్లలో నిర్వహిస్తున్న టెన్త్ విద్యార్థులు 170 మందికి 120 మంది హాజరు కాగా, హాజరు కాని మిగిలిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్‌లో టీచర్లతో మాట్లాడించారు. విద్యార్థుల నోటుపుస్తకాలు, వర్క్ పుస్తకాలను పరిశీలించి, మరింత మెరుగుపర్చుకోవాలని వారికి సూచించారు. టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు విధిగా తమ పిల్లలను ఈ తరగతులకు పంపాలని టీచర్లు వారికి తెలిపారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు తర్ఫీదును అందిస్తున్న ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రీ ఫైనల్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈవో కోరారు. డీఈవో ఆదేశాల మేరకు ప్రతి రోజు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వెనుకబడిన విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా మెటీరియల్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆహ్మద్, టీచర్లు విజయసింహ, బేగం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి



బాధిత భవన నిర్మాణ కార్మికుని కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న సంఘం నాయకులు

భీమడోలు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భీమడోలు అయ్యప్ప తాపీమేస్త్రిల సంఘం కృషి చేస్తుందని చేస్తుందని ఆ సంఘం నాయకులు తెలిపారు భీమడోలులో భవన నిర్మాణ రంగం కార్మికులు, దురదృష్టవశాత్తు మృతి చెందిన పొగిరి మారుతీనగర్, గంటా నాగరాజు, గుర్రాల సురేష్ కుటుంబ సభ్యులను శనివారం సంఘం నాయకులు పరామర్శించి వారిని ఓదార్చారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ వంతు ఆర్థిక సాయం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేలనగదు, 50 కేజీల బియ్యం చొప్పున వారికి అందించారు. బాధిత కుటుంబాలకు తాము అండగా ఉంటామని పేర్కొన్నారు. పెద్దలు కోటిపల్లి సీతారామయ్య, ఈతకోట తాతాజీ, కేతినేని సోమరాజు, గాదం రాము, గంటా ప్రసాద్ పాల్గొన్నారు.

3న విష్ణాలయం వార్షికోత్సవం

దెందులూరు: స్థానిక విష్ణాలయంలో ఈనెల 3న వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శోభనాద్రి పార్థసారథి, రామదండు మండల కమిటీ నాయకులు సుబ్బిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం ఆలయంలో వారు మాట్లాడుతూ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో శాంతి కల్యాణం, నవగ్రహ, సుదర్శన హోమం, అనంతరం శాంతి కల్యాణం నిర్వహిస్తారన్నారు. దెందులూరుతో పాటు సమీప గ్రామాల్లోని భక్తులు విష్ణాలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేయాలి

దెందులూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వెంటనే కంటి వైద్య పరీక్షలు ప్రారంభించాలని దెందులూరు మండలం వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు తలారి రామకృష్ణ నాయకులు గోరిపర్తి రంగారావు డిమాండ్ చేశారు. శనివారం పోతునూరులో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరు వస్తుందని దుర్బుద్ధితో ప్రభుత్వ వైద్యశాలలో కంటి వైద్యపరీక్షలు, ఆపరేషన్లు నిలుపుదల చేశారన్నారు. చిన్నపిల్లల విషయంలో కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయాలను విద్యార్థులకు ఆపాదించకుండా వారి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, ఉజ్వల భవిష్యత్తు లక్ష్యంగా ప్రభుత్వం పాఠశాలల్లో కంటి వైద్య పరీక్షలు చేయాలన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలను ప్రోత్సహించొద్దు




ఉంగుటూరులో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

ఉంగుటూరు: స్థానికంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రాజ్‌మనోజ్ శనివారం పరిశీలించారు. ఇరిగేషన్‌కు చెందిన బోదెల తవ్వకం పనులు చేస్తుండగా పని దగ్గరకు వెళ్లి ఆయన పరిశీలించారు.ఆకస్మాత్తుగా ఆయన వెళ్లడంతో కొందరు కూలీలు కూర్చుని ఉండటం గమనించిన ఎంపీడీవో నిర్దేశించిన పని పూర్తి కాకుంటే కూలీ తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇద్దరు రాకపోయినా మస్తరు వేయకపోవడాన్ని గుర్తించిన ఎంపీడీవో సిబ్బందిని హెచ్చరించి రికార్డుల్లో సరి చేయించారు. పనులకు హాజరుకాని వారికి బినామీ మస్తర్లు వేస్తే పనిచేసే వారికి కూలి తగ్గిపోతుందని ఎంపీడీవో కూలీలకు వివరించారు. బినామీ మస్తర్ల నమోదును ప్రోత్సహించవద్దని, ఇలాంటి వాటిని చూసుకోవాల్సిన బాధ్యత పనిచేసే కూలీలపై ఉందని వివరించారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణ నిర్ణయం దుర్మార్గం

దెందులూరు: ప్రసిద్ధిగాంచిన సింహాచలం దేవాలయ భూములను ఆక్రమించుకోవడం దుర్మార్గమని, రాష్ట్ర ప్రభుత్వం తప్పును సరిదిద్దకపోగా ఆక్రమించుకున్న 12 వేల మంది ఇళ్లను క్రమబద్ధీకరిస్తామని తీసుకున్న నిర్ణయం తప్పని సిటిజన్స్ రైట్స్ అండ్ రెస్పాన్సిబిలిటీ జాతీయ కన్వీనర్ చలమల సత్యనారాయణ కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం గాలాయగూడెంలోని ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వీహెచ్‌పీ జాతీయ నాయకత్వానికి, సనాతన బోర్డుకు, బీజేపీ అధిష్టానానికి, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఫిర్యాదు చేస్తామని సత్యనారాయణ అన్నారు. ఈ భూములను ప్రభుత్వం రెగ్యులర్ చేస్తే రాష్ట్రంలో అన్ని దేవాలయ భూములూ ఆక్రమణకు గురవుతాయని అన్నారు.

ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ మృతి



పిల్లి రామకృష్ణ (ఫైల్)

పెదవేగి : అందరివాడు, స్నేహశీలి, ప్రజలు మెచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందిన పిల్లి రామకృష్ణ మృతితో అంకన్నగూడెం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. పెదవేగి మండలం అంకన్నగూడెం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు, మండల విప్ పిల్లి రామకృష్ణ (39) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన అకాల మరణం తీరని లోటని వైఎస్సార్‌సీపీ శ్రేణులు కన్నీటి పర్యంతమయ్యారు. రామకృష్ణకు భార్య ఆనంది, కుమార్తె, వృద్ధ తల్లిదండ్రులు, వికలాంగ సోదరుడు ఉన్నారు. రామకృష్ణ పార్థివదేహాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు. చళ్లగొళ్ల భూస్వామి, తేరా ఆనంద్, మాదేపల్లి సర్పంచ్ ప్రభు, మేడికొండ కృష్ణారావు, చళ్లగొళ్ల తేజ, బొద్దు చౌదరి, దిమ్మిటి రమేష్, పినకడిమి, భోగాపురం, కొప్పాక, సింగవరం నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుబ్బారావు లేని లోటు తీరనిది



ఎ.సుబ్బారావు (ఫైల్)

పెదవేగి : ప్రతి వ్యక్తితో సరదాగా మాట్లాడుతూ నవ్విస్తూ ఉండే ఆమం సుబ్బారావు లేని లోటు తీరనిదని విజయరాయి గ్రామ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగి మండలం విజయరాయి గ్రామ వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆమం సుబ్బారావు శనివారం ప్రమాదవశాత్తు మరణించడం బాధాకరమని, ఆయన మరణం తీరని లోటని నాయకులు సంతాపం తెలిపారు. సుబ్బారావు కుటుంబ సభ్యులకు గ్రామ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేసి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.